క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నూతనకల్ : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నూతన టవర్ నిర్మాణ పనుల్లో భాగంగా మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బస్సుల సంఖ్య పెంచాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న బుర్ర శ్రీనివాస్ గౌడ్

తిరుమలగిరి : తిరుమలగిరి నుంచి సాయంత్రం 5 గంటల తరువాత హైదరాబాద్‌కు వెళ్లే రూట్‌లో ఆర్టీసీ బస్సులు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బస్సుల సంఖ్య పెంచాలని శుక్రవారం తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తిరుమలగిరి నుంచి హైదరాబాద్‌కు వెళ్లే రూట్‌లో సాయంత్రం 5 గంటల నుంచి రెండు, మూడు బస్సులే ఉండటంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అర్వపల్లి : సమగ్ర శిక్షా ఉద్యోగులతో సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే చర్చలు జరిపి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం (పీపీఎల్) రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. 18 రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో గెస్ట్ టీచర్లుగా భౌతిక శాస్త్రం, ఇంగ్లిష్ సబ్జెక్టులను బోధించుటకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి బోయిని లింగయ్య తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేజీబీవీలో భౌతిక శాస్త్రం (సీఆర్‌టీ), ఇంగ్లిష్ (సీఆర్‌టీ) సబ్జెక్టులకు సంబంధించి తాత్కాలిక (గెస్ట్ టీచర్ల) పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. గెస్ట్ టీచర్లకు రూ.18వేలు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల లో డిగ్రీ, బీఈడీ ఉండాలని, పీజీ చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుందని, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 31లోగా ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రానికి చెందిన నలుగురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ టోర్నమెంటుకు ఎంపికైనట్లు జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మోర్తాల నాగిరెడ్డి శుక్రవారం తెలిపారు. జనగామలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే 50వ రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ టోర్నమెంటులో జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారులు మాలావత్ రాముడు, బత్తుల రవితేజ, బాణావత్ సైదులు, షేక్ జావిద్ పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే


సీతారాంపురంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీఓ గోపి

అర్వపల్లి : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. శుక్రవారం సర్వేను అర్వపల్లి, సీతారాంపురం, జాజిరెడ్డిగూడెం, రామన్నగూడెం, వేల్పుచర్ల, పర్సాయపల్లి తదితర గ్రామాల్లో మండల పంచాయతీ అధికారి టి.గోపి పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు నవీన్‌రెడ్డి, నెహ్రూ నాయక్, కృష్ణవేణి, దస్తగిరి, నాగయ్య, బాషా, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి


బందెల రవి(ఫైల్)

తిరుమలగిరి : మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు బందెల రవి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. అతడి మృత దేహానికి పార్టీ నాయకులు నివాళులర్పించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోదాడరూరల్ : సీఎం సహాయ నిధి నుంచి కోదాడ మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన ఇంటి సుబ్బమ్మకు రూ.52 వేలు, జక్కంపూడి కల్యాణికి రూ.16వేలు మంజూరయ్యాయి. శుక్రవారం స్థానిక నాయకులు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఇర్ల సీతారాంరెడ్డి, జాబిశెట్టి నాగప్రసాద్, బండి చిన్నకోటయ్య పాల్గొన్నారు.

‘ఉపాధి’లో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత

- జాజిరెడ్డిగూడెం మండలంలోని ఏడు గ్రామపంచాయతీల్లో ఖాళీలు
- ఉపాధి పనుల నిర్వహణ, పర్యవేక్షణకు ఇబ్బందులు


కాసర్లపహాడ్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

అర్వపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నారు. వలసలను నివారించి కూలీలకు పని కల్పించడం ఈ పథకం ఉద్దేశం. అయితే ఈ పథకం క్షేత్ర స్థాయిలో అమలు కావడంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లది ప్రధాన పాత్ర. కాగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు సరిపోను (క్షేత్రసహాయకులు) లేక కూలీలు, ఉపాధి సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా 10 పంచాయతీలకు మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు. మిగిలిన 7 పంచాయతీలకు ఫీల్డ్‌అసిస్టెంట్‌ల ఖాళీలు ఉన్నాయి.

పనుల నిర్వహణకు ఆటంకం..

జాజిరెడ్డిగూడెం మండలంలో 17 గ్రామ పంచాయతీలకుగాను సుమారు 24,000 మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. అలాగే 9,810 ఉపాధి కార్డులున్నాయి. ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు గ్రామాల్లో ఉపాధి పని మస్టర్ల నిర్వహణ, హరిత హారం, జాబ్ కార్డుల అప్‌డేషన్, 7 రిజిస్టర్ల నిర్వహణ, గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహించే అభివృద్ధి పనులను పర్యవేక్షించడం, ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రతి కూలీకి ఉపాధి పని కల్పించడం తదితర పనులను చేస్తుంటారు. మండలంలోని నాణ్యతండా, సూర్యనాయక్‌తండా, బొల్లంపల్లి, రామన్నగూడెం, ఉయ్యాలవాడ, వేల్పుచర్ల, జాజిరెడ్డిగూడెం గ్రామాలకు ఫీల్డ్‌అసిస్టెంట్‌లు లేరు. దీంతో ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టుటకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులపై అదనపు భారం పడి వారు కూడా పని ఒత్తిడితో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ఎఫ్ఏల ఖాళీలను భర్తీచేయాలని పలువురు కోరుతున్నారు.

వేతనాలు తక్కువ



నేను 2010 నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నా. కానీ సీనియర్ మేట్ వేతనం నెలకు రూ.7,500 మాత్రమే ఇస్తున్నారు. అర్వపల్లి నుంచి రామన్నగూడెం పరిధిలోని కొత్తగూడేనికి పనులకోసం వెళ్లిరావాలంటే 20కి.మీ దూరం ఉంటుంది. రవాణా ఖర్చులకు కూడా వేతనం చాలడం లేదు. – ఎం.మల్లయ్య, ఎఫ్ఏ, అర్వపల్లి

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి



అన్ని గ్రామపంచాయతీల కు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి. జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా ఏడు గ్రామ పంచాయతీలలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేరు. దీంతో పనులకు ఆటంకం కలుగుతోంది. గ్రామ పంచాయతీకి ఒక ఫీల్డ్ అసిస్టెంట్ తప్పనిసరిగా ఉండాలి. – వజ్జె శ్రీనివాస్, రైతు నాయకుడు

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న తాజా మాజీ సర్పంచులు

సూర్యాపేట : పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పలువురు మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చివ్వెంల సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జూలకంటి సుధాకర్‌రెడ్డి, నూతనకల్ సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు చూడి లింగారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగించి బిల్లులు వెంటనే విడుదల చేసేలా చూడాలని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్‌లు, నిర్మల గోవిందరెడ్డి, ధరావతు భద్రు, మానస రాము, ధరావతు వెంకన్న సుజాత, పుట్ట గురువేందర్, పల్లేటి నాగయ్య, హనుమంత రావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకే పోటీలు


క్రీడాకారులకు టీషర్ట్స్ అందజేస్తున్న పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట : గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకే సీఎం కప్ క్రీడా పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందని పీసీసీ సభ్యుడు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం పిల్లలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సూర్యాపేట జిల్లా నుంచి ఎంపికైన కబడ్డీ క్రీడాకారులకు మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఫొటో లోగోతో కూడిన టీషర్ట్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోందని తెలిపారు.

29న బస్ డిపో సాధన కమిటీ ధర్నా


మాట్లాడుతున్న కడెం లింగయ్య

తిరుమలగిరి : తిరుమలగిరిలో బస్సు డిపో నిర్మాణం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని, ఈ నెల 29వ తేదీన తిరుమలగిరిలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని బస్ డిపో సాధన కమిటీ కన్వీనర్ కడెం లింగయ్య కోరారు. శుక్రవారం బస్ డిపో సాధన కోసం తిరుమలగిరిలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బస్ డిపో నిర్మాణం కోసం పార్టీలకు అతీతంగా అందరూ కలిసిరావాలని కోరారు. ఈ నెల 29న ధర్నా, 30వ తేదీన బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే.పాషా, వేల్పుల లింగయ్య, కొండా సోమయ్య, చిలుకల రమేష్, నలుగూరి రమేష్, రూపాని వెంకన్న, పనికెర సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

పార్టీల విలీన సభ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూర్(ఎస్) : ఈ నెల 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు అలుగుబెల్లి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆత్మకూరు, తుమ్మల పెన్‌పహాడ్ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో విలీన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కంచర్ల నర్సక్క, డేగల వెంకటక్రిష్ణ, పీవైఎల్ మండల నాయకులు పోతురాజు ప్రతాప్, పగిడి ఎల్లయ్య, వెంకట్‌రెడ్డి, బాలయ్య, మైబెల్లీ, రవీందర్‌రెడ్డి, రాములు, నాగరాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగే సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ కోరారు. విలీన సభ విజయవంతానికై శుక్రవారం అర్వపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2013లో వివిధ కారణాల వల్ల సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి సాదినేని వెంకటేశ్వర్లు వర్గం విడిపోయిందని తెలిపారు. ప్రజా ఉద్యమాలు చేపడుతున్న పార్టీలు తిరిగి విలీనమవ్వడం శుభపరిణామమన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, లింగయ్య, సైదులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస పూజలు


అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం దేవాలయంలో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు


తుంగతుర్తి : రామాలయంలో పూజలు..

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం 12వరోజు పన్నెండవ పాశురాన్ని అర్చకులు పఠించారు. మహిళలు మంగళ హారతులతో ప్రదర్శనగా వచ్చి గోదాదేవికి కుంకుమార్చన చేశారు. ఉదయం, రాత్రి వేళల్లో మహిళలు సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని తుంగతుర్తి మండల కేంద్రంలో శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవికి భక్తులు మంగళహారతులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పూజారి కాటూరి రామాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ సంక్షేమ పథకాలతో బీజేపీకి ఆదరణ


మాట్లాడుతున్న బొబ్బ భాగ్యారెడ్డి

తిరుమలగిరి : దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాలతో జిల్లాలో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమలగిరిలో తుంగతుర్తి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ సభ్యత్వాల నమోదుకు సూర్యాపేట జిల్లాలో అనూహ్య స్పందన లభిస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కిరాజు యశ్వంత్, మల్లెపాక సాయిబాబా, కాప రవికుమార్, కూరాకుల వెంకన్న, వేల్పుల బంగారి, స్వామి, రమేష్, సాగర్, శంకర్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల నిరసన

మేళ్లచెరువు : తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గ్రామపంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బందికి గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, జీఓ నంబర్ 60 ద్వారా వేతనాలను కేటగిరీ వారీగా చెల్లించాలని అన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, సైదులు, అశోక్, నరేష్, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, సైదులు, ఉప్పలమ్మ, కోటయ్య, శ్రీను, కిరణ్, సుధాకర్ పాల్గొన్నారు.

గరిడేపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోకపోవడంపై సీఐటీయూ పిలుపుమేరకు శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులకు ఏడాదికి రెండు జతల యూనిఫామ్ అందజేయాలన్నారు. అనంతరం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోపగాని సత్యం, రావుల వెంకన్న, కొండ సైదులు, వెంకన్న, రవి, నాగచారి, మహేష్, ప్రవీణ్, బాలు, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

మోతె : గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు కోరారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ పిలుపుమేరకు శుక్రవారం మోతె మండల కేంద్రంలో జరిగిన టోకెన్ సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టాల రవిచంద్ర, పి.లక్ష్మీనారాయణ, నాగమణి, శాంత, చాంది, మల్లయ్య, వీరయ్య, సాలయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు


తిరుమలగిరి : మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే


తుంగతుర్తిలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


భానుపురి : జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..


సూర్యాపేట : చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుధాబ్యాంక్ సిబ్బంది


చివ్వెంల : మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

తిరుమలగిరి : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాస గృహంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్, జమ్మిలాల్, కందుకూరి అంబేద్కర్, మూల అశోక్‌రెడ్డి, సుంకరి జనార్దన్, కందుకూరి లక్ష్మయ్య, డానియల్, సుధాకర్, కృష్ణ, భాస్కర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి

భారత దేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్‌రెడ్డి, జమ్మిలాల్, మూల అశోక్‌రెడ్డి, సుంకరి జనార్దన్, కందుకూరి అంబేద్కర్, రాపాక సోమేష్, మూల రవీందర్‌రెడ్డి, వంశీ, సుధాకర్, డానియల్, జితేందర్, బత్తుల శ్రీను, లింగయ్య పాల్గొన్నారు.

భానుపురి : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని పీసీసీ సభ్యుడు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, వేములకొండ పద్మ, గండూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ భారత దేశానికి చేసిన సేవలు మరువలేనివి అని సూర్యాపేట జిల్లా కోర్టు పీపీ నాతిసవిందర్ కుమార్ అన్నారు. శుక్రవారం మాజీ ప్రధాని మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ న్యాయవాదులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, సీనపల్లి సోమేశ్వర్, బొమ్మగాని శ్రీనివాస్, ఎండీ ఫరిదొద్దీన్, పి.నర్సింగరావు, దాచేపల్లి లింగయ్య, అనుములపురి సైదులు, భానోతు మంగులాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట : మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మరణం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని సుధా బ్యాంకు ఛైర్మన్ మీలా మహదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ అన్నారు. శుక్రవారం సుధా బ్యాంకు ఆవరణలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు రవీందర్ రెడ్డి మాధవి, సైదులు, సిబ్బంది ఖాతాదారులు పాల్గొన్నారు.

నాగారం : ఆర్థిక సంస్కరణల నిపుణుడు, భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల నాగారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగారం ఎక్స్‌రోడ్డులో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, నాయకులు నాతి వీరమల్లు, పసుపులేటి వెంకటరెడ్డి, కన్నెబోయిన వెంకటభిక్షం, పాశం యాదవరెడ్డి, ఆకుల ప్రతాప్, షేక్ వలి, కొలిపాక సాయికుమార్ పాల్గొన్నారు.

మద్దిరాల : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందడంతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అర్వపల్లి : కొమ్మాలలో శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ ఛైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, కె.సైదులు, కె.శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వీరారెడ్డి, ఉదయ్, వెంకటాద్రి, విజ్జిరెడ్డి, వీరస్వామి, యాదగిరిరెడ్డి, శ్రీను, వెంకన్న, శ్రీరాములు, లింగయ్య, భద్రయ్య, శ్రీను పాల్గొన్నారు.

తుంగతుర్తి : భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తుంగతుర్తి మెయిన్‌రోడ్డుపై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, తిరుమలప్రగడ కిషన్ రావు, నల్లు రామచంద్రారెడ్డి, ఉప్పుల రాంబాబు, అనిల్, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో భూరెడ్డి సంజీవరెడ్డి, పాల్వాయి నాగరాజు, ఎలిమినేటి కృష్ణప్రశాంత్, దరిపెల్లి వీరన్న, తదితరులు పాల్గొన్నారు.


తిరుమలగిరిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


అర్వపల్లి : కొమ్మాలలో నివాళులర్పిస్తున్న సురేందర్‌రెడ్డి, నాయకులు


నూతనకల్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


నాగారం : మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డులో..

దొడ్డు యూరియా అందించాలని ఆందోళన


యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చున్న రైతులు

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని అమరవరంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట పలువురు రైతులు దొడ్డు యూరియా అందించాలని శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దొడ్డు యూరియాను కొందరికి మాత్రమే ఇస్తున్నారని, చిన్న, సన్నకారు రైతులకు సన్న యూరియా ఇస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. క్యూలైన్‌లో నిల్చున్న రైతులకు కాకుండా పలుకుబడి ఉన్న రైతులకు మాత్రమే దొడ్డు యూరియా ఇస్తున్నారని, సంబంధిత అధికారులు స్పందించి రైతులందరికీ యూరియాను సమానంగా పంపిణీ చేసేలా చూడాలని వారు కోరారు.

ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

అర్వపల్లి : అజయ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అనేక విధాలుగా సేవలందిస్తున్నట్లు ఆ ట్రస్ట్ ప్రెసిడెంట్, వ్యవస్థాపకుడు, పాస్టర్ ఇరుగు సంసోన్ అన్నారు. మండల పరిధిలోని అడివెంల క్రాస్‌రోడ్డులో ఉన్న కవనెంట్ గ్రేస్ చర్చిలో శుక్రవారం క్రైస్తవుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఇప్పటికే ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు అందజేయడంతోపాటు వివిధ రకాలుగా సాయపడుతున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పాస్టర్ ఇరుగు సంగీత, జేమ్స్, లూక, పృథ్వీ, అజయ్, దేవదాస్, శ్రీను, భిక్షమయ్య పాల్గొన్నారు.